స్కెచ్

# నమ్మకానికి ఎడా-పెడా

ఓగేటి శివరామకృష్ణ

ఈ మధ్యనే అంటే కొద్దిరోజులక్రితమే విక్రమాగ్రహారంలో త్రివిక్రమరావు అధ్యక్షతను నాస్తిక సంఘ ప్రారంభోత్సవం జరిగింది. నేతిబీరకాయలో నేయి విధంగానే, విక్రమాగ్రహారంలో అగ్రహారీకులు సర్వసాధారణంగా ఛాందసులై దైవాన్ని నమ్ముకుని ఉంటారు. అసలు ఈ అగ్రహారంలో ఆ అగ్రహారీకులే లేరు. మరాలాటప్పుడు, దైవాన్ని నమ్మేవారు లేరన్నమాటేగా!

కాదు, వున్నారు. గ్రామంలో మొత్తంలో తొంభై ఎనిమిది పెర్సంటు విగ్రహారాధకులే. ఎక్కడో మిగిలిన యిద్దరూ నాస్తికులై ఊరు పేరూ లేకుండా ఉన్నారు.

ఊరంతా ఆస్తికులవటంవల్ల, దేవాలయాలకూ, దేవుళ్ళ కళ్యాణాలకు కొరత లేకుండా- ప్రతి పదిహేను రోజులకు యేదో ఉత్సవం జరుగుతూనే ఉంటుంది. దేవుడి పేరుతో భగవద్భక్తులంతా చక్రపొంగలులకూ దద్దోజనాలకూ లోట్లు లేకుండా యేదో ప్రసాదం కడుపులో పడేస్తుంటారు.

ఊరూ పేరూ లేకుండా, నాస్తికులుంటూండినా, వాళ్ళ హృదయాలు మాత్రం, దేవుళ్ళకు పూజా పునస్కారాలూ, అన్న సంతర్పణాలూ జరుగుతూంటే అట్టుడికి పోయినట్టుగా ఉడికిపోతూండేవి. పైకి వాళ్ళ ద్వేషం వెల్లడించక పోయినా, కమ్యూనిస్టుసోదరుల్లాగ తమతమఉద్దేశాలనూ, ఆశయాలనూ, బహిరంగంగా కాకపోయినా రహస్యంగానయినా వెల్లడించుతూ ఉండేవారు. నాస్తికసంఘ కేంద్రకార్యాలయంతోటీ రాష్ట్ర కార్యాలయంతోటీ ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూ ఉండేవారు.

ఈవిధంగా నాస్తికసంఘం రహస్యంగా తమ కార్యక్రమం నిర్వర్తించుకొంటూంటే, ఆస్తిక సంఘసభ్యులు బహిరంగసభలు జరిపి నాస్తిక సంఘాన్ని దుయ్యపట్టేవారు. నాస్తిక సంఘసభ్యులు మరితక్కువగా ఆస్తిక సమావేశాల్లో పాల్గొంటూన్నా నోరెత్తి అప్పుడప్పుడు వారిని ప్రతిఘటిస్తున్నా ఫలితంమాత్రం ఆస్థికులవైపే మొగ్గుతూండేది.

ఇలా ఉండగా దేశం అంతటితోబాటు విక్రమాగ్రహారానికిగూడా కష్టకాలం ప్రాప్తించింది. కష్టంఅంటే మరేం లేదనుకోండి,— వర్షాలు జోరుగా కురవవలసిన రోజుల్లో కురవకండా పోవటం పర్యవసానంగా పంట పొలాలన్నీ బీళ్ళయిపోయాయి, నేల చీలలుతీసింది. ప్రజలంతా ఏం చేయటానికి తెలియని అయోమయ పరిస్థితుల్లోకి వచ్చారు.

ఆస్తిక సంఘంవారికి కేంద్రంనుంచి ఒక సలహా వచ్చింది. దేశం మొత్తంమీద వర్షాలు తక్కువగా కురుస్తున్నాయని సృష్టి లయకారకుడైన ఆ పరాత్పరునకు ప్రజలమీద ఆగ్రహం కల్గటమే దానికి కారణమనీ, తిరిగి వారి అనుగ్రహాన్ని సంపాదించటం కోసంగా శ్రీవారిని వారితోబాటు యితర దేవుళ్ళను దేశంలోని ఆస్థికులంతా వర్షం కురిపించమని సేవించటం ప్రార్థనలు జరిపించటం చేయాల్సిందని ఆ సలహా.

అగ్రహారపు ఆస్తిక సభ్యులంతా వచ్చిన ఆ తాఖీదును, అతి జాగ్రత్తగా పరిశీలించినమీదట గ్రామంలో ఒక బహిరంగసభను యేర్పాటుచేయ నిశ్చయించారు.

సమావేశానికి నాస్తికసభ్యులు సహితం హాజరయ్యారు. అనేక విషయాలమీద చర్చ జరిగినమీదట ఆస్తిక సభ్యులంతా ఒక్కసారిగా "అగ్రహారంలో వర్షంకోసం అన్ని దేవుళ్ళకూ పూజలూ, జపాలూ, తపాలు చేయా"లనిఅన్నారు.

నాస్తిక సభ్యులుమాత్రం యధాధోరణిలో "మంత్రాలకు చింతకాయలు రాల్తే మీ జపతపాలకు దేవుడు వర్షం కురిపిస్తాడు" అన్నారు.

వర్షాలు కావాలని ప్రజలు కలత మనస్సు

ంతో ఉండటంవల్ల నాస్తికుల మాటలు మాత్రం ఏ ఒకళ్ళూ పట్టించుకోలేదు.

మర్నాటినుంచి, ఒక పదిరోజులు వరుసగా దేవాలయాల్లో గంటలు "ఖంగు ఖంగు"న మోగుతూంటే భగవద్భక్తులంతా తమతమ యిష్టదైవాలను ప్రార్థించుతూంటే జరిగిపోయాయి. అయితే కేంద్రం వారి తాఖీదులలో ఫలితం మాత్రం కల్పించలేదు.

ఈ పదిరోజుల కాలంలోనూ నాస్తికులు రహస్యంగానూ బహిరంగంగానూ, తమ ఉద్దేశాలను వివరిస్తూ, "వర్షాలు పడితే చూస్తాంగా" అంటూ ఉన్నారు.

పదిరోజులు గడిచాయి కాని వర్షాలు మాత్రం పడలేదు, నాస్తిక సంఘం తన ప్రాపగాండాను మరింత హెచ్చుచేసుకుంది. ఫలితంగా ప్రజల్లో కొంత మార్పు వచ్చింది. "వర్షాలు కురిపించని దేవుణ్ణి నమ్మటం యెందుకూ—" అని నెమ్మది నెమ్మదిని ప్రజలు నాస్తికసంఘంలో సభ్యులవటం ప్రారంభించారు.

మరింకేం కావాలి? ఆస్తిక సంఘ సభ్యులంతా నాస్తికంలో చేరారు. "మరి మూడురోజులలో వర్షాలు బాగా పడతాయ"ని నాస్తిక సంఘంలో జోతిష్యం తెలిసిన ఒక యోధుడు చెప్పాడు.

మూడు రోజుల కోసం యెదురు చూశారు. మూడోరోజు వచ్చింది. నాస్తికసంఘ జోస్యుడు చెప్పిన మాట నిజమైంది. బ్రహ్మాండమైన వర్షం ఏకధారగా రెండురోజులు కురిసింది. రైతులు తమతమ వ్యవసాయపు పనులు చేసుకోనటము సాగించారు.

ఇంతవరకూ ఆస్తిక సంఘంలో నమ్మకమూ, ఆసక్తి గలవాళ్ళకు నాస్తిక సంఘం మీద మమకారం యేర్పడింది. ఆస్తిక సంఘాన్ని వదిలి నాస్తిక సంఘంలో చేరారు.

మరి ఆ అగ్రహారంలో నాస్తికులు నిండిపోయారు. ఆస్తికులు వేలెత్తి చూపడానికి కూడా లేకపోయారు. దేవాలయాలూ, దేవుళ్ళూ మూలపడ్డారు. విగ్రహారాధన నశించింది.

తమ చిరకాల వాంఛ నెరవేరటంతో చాటుమాటుగా యిదివరకు ప్రచారం చేసుకొన్న నాస్తిక సభ్యులు యిప్పుడు పెద్ద యెత్తులోకి వచ్చారు. కేంద్రకార్యాలయంతో సంప్రదింపులు జరిపిన పిమ్మట, ఒక ముఖ్య కార్యాలయం నూతనభవనం ప్రత్యేకంగా నిర్మించి, నెలకొల్పటకు, నాస్తిక సంఘాన్ని ఈ అగ్రహారంలో పునర్నిర్మించి కొత్త సభ్యులు మరికొంతమందిని చేర్పించుటకూ ఆలోచించారు.

ఆ ఆలోచనలుతోనే విక్రమాగ్రహారానికి, నాస్తిక సంఘం అంటే పడి కొట్టుకుంటాడనే పేరు సంపాదించుకొన్న యోధుడు, త్రివిక్రమరావును అధ్యక్షునిచేస్త!

పెద్ద హడావిడితో యేర్పాట్లు జరిగాయి. ఎందరెందరో వ్యక్తులు ఉపన్యసించటానికికూడా వచ్చారు. అధ్యక్షులవారు ఆసనంలో ప్రవేశించారు కూడాను.

కాని యింతలోనే యేదోమరచిపోయినట్లుగా నాస్తిక సంఘ సభ్యుడూ, అగ్రహారంలో నాస్తిక సంఘ అభివృద్ధికి కారకుడూ అయిన జంబుకేశ్వరరావు (పేరుకుతగ్గ విగ్రహం) హడావిడిగా అధ్యక్షులున్న వేదికమీరకు పరుగెత్తుకొచ్చి అన్నాడు: "ఆగండి, నాదోమనవి. ఈ దినం నాస్తిక సంఘం పునరుద్ధరణ జరుగుతున్నట్లే—ఈ సంఘం, రోజురోజుకూ పెరిగి పెద్దదవుతుందని ఆశిస్తున్నా. అందుకు మీరంతా తోడ్పడాలి. ఎందరో మహా వక్తలు, నాస్తికత్వాన్ని గురించి, ముచ్చటించటానికి, అధిక ప్రయాసతో యిప్పుడు వేంచేశారు. వారంతా చాలా సావకాశంగా మాట్లాతారు. మీకేమయినా అనుమానాలుంటే అడిగి తీర్చుకోవచ్చు. మరోసంగతి. ఒక శుభప్రదమైన పని చేయబోయేటప్పుడు—విఘ్నాలు కలగకుండా మనంచూడాలి! మనం యిప్పుడు శుభప్రదమైన నాస్తిక సంఘాన్ని అభివృద్ధికోరుతూ పునర్నిర్మిస్తున్నాంగనక—యెటువంటి విఘ్నములూ కలుగకుండా ఉండేందుకుగాను, విఘ్నేశ్వరుని ఒక్కసారి మనసారా ప్రార్థిద్దాం" అని. ఇంకేముంది?

దైవ విశ్వాసం కొందరిదగ్గర గులాబీకి సువాసనవలె ఉంటుంది. మరి కొందరిదగ్గిర అది మురిగిపోయిన చేపలవలె దుర్వాసనగా పరిణమిస్తుంది.